స్వదేశీ వైద్య పరికరాల ఉత్పత్తితో

పేదలకు అందుబాటులో వైద్యం

80 శాతం పరికరాలు దిగుమతిపై ఆధారం

దూరదృష్టితోనే ఆనాడు మెడికల్ డివైజ్ పార్క్ ఏర్పాటు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

హ్యావెల్ లైఫ్‌సైన్స్‌లో కెమికల్ ల్యాబ్ ప్రారంభం 7



ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకుంటున్న భక్తులు



గర్భగుడిలో పూజలందుకుంటున్న వనదుర్గమ్మ

దర్శనమిచ్చిన వనదుర్గమ్మ

పాపన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయలలో వనదుర్గా మాత భక్తులకు దర్శనమిచ్చారు. మంజీర నది వరదల కారణంగా రెండు నెలలుగా ప్రధాన ఆలయం మూసి ఉంచి, రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి దర్శనం కల్పించిన విషయం తెలిసిందే. సింగూరు ప్రాజెక్టు గేట్లు మూసేయడంతో రెండు రెండు రోజులుగా అమ్మవారి ఆలయం తెరిచి శుభ్రం చేశారు. శుక్రవారం గర్భాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పండుగ వ్యాపారం ఎట్లా జరుగుతోంది..?

సంగారెడ్డిలో చిరువ్యాపారులతో జగ్గారెడ్డి మాటముచ్చట

సంగారెడ్డి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వ్యాపారం ఎలా జరుగుతోందని సంగారెడ్డిలోని చిరువ్యాపారులను జగ్గారెడ్డి ఆత్మీయంగా పలకరించారు. పట్టణంలోని ఐబీ గెస్ట్‌హౌస్ సమీపంలో పండుగ కోసం ఉపయోగించే బొమ్మలు, ప్రమిదలు, పూల దుకాణాల వ్యాపారుల వద్దకు జగ్గారెడ్డి వెళ్లి మాట్లాడారు. బొమ్మలు, ప్రమిదలు ఎక్కడి నుంచి తెస్తున్నారు..? ఎంత గిరాకీ అవుతున్నది..? గిట్టుబాటు అవుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చివరకు వారి వద్ద నుంచి బొమ్మలు, ప్రమిదలు కొనుగోలు చేశారు.



సంగారెడ్డిలో బొమ్మల వ్యాపారితో మాట్లాడుతున్న జగ్గారెడ్డి



దీపావళి ప్రమిదలు కొనుగోలు చేస్తున్న జగ్గారెడ్డి

నేడు తీగలకుంట పల్లెలో

రామచంద్రారెడ్డి అంత్యక్రియలు



రామచంద్రారెడ్డి (ఫైల్)

కోహెడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా అంబుజ్‌మడ్‌లో గత నెల 22న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కాత (కట్టా) రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్, రాజు దాదా అంత్యక్రియలు శనివారం జరగనున్నాయి. ఆయన స్వగ్రామం కోహెడ మండలం తీగలకుంట పల్లిలో ఏర్పాట్లు చేస్తున్నారు. రామచంద్రారెడ్డి ఎన్‌కౌంటర్ బూటకమని ఆయన కుమారుడు రాజాచంద్ర ఆ రాష్ట్ర హైకోర్టు, సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తన తండ్రి భౌతికకాయానికి కుటుంబ సభ్యులు, న్యాయమూర్తి లేకుండానే పోస్టుమార్టం నిర్వహించారని, ఈ ఎన్‌కౌంటర్ బూటకమని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టులో తీర్పు అనుకూలంగా రాకపోవడంతో శుక్రవారం మృతదేహాన్ని తీసుకువస్తున్నట్లు రాజాచంద్ర 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. శనివారం ఉదయం గ్రామంలోని వ్యవసాయక్షేత్రంలో అంత్యక్రియలు జరుగుతాయని తెలిపారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

బీసీ నేతల పిలుపు 8

వివిధ పార్టీలు, సంఘాల మద్దతు

'మల్టీ' మాయ రూ.20 కోట్లు!

నిండాముంచిన అత్యాశ..!

- వెలుగుచూస్తున్న ఎల్ఎఫ్ వర్క్ దారుణాలు
- మెదక్ కేంద్రంగా చక్రం తిప్పిన ఒకరు
- వైద్యశాఖ ఉద్యోగిది కీలకపాత్ర
- మెజార్టీ శాతం ప్రభుత్వ ఉద్యోగుల పెట్టుబడులే
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాధితులు

"సిద్దిపేట జిల్లాలోని వైద్యశాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఎల్ఎఫ్ వర్క్ సంస్థను నమ్మి రూ.10లక్షలు సొంతంగా జమ చేశాడు. చైన్‌సిస్టమ్ ద్వారా రూ.24లక్షల వరకు చెల్లించాడు. మొత్తంగా రూ.34లక్షల పెట్టుబడి పెట్టి మోసపోయాడు. ఇతనిలాగే పెట్టుబడులు పెట్టిన వారికి తన కళ్లముందే రోజూ డబ్బు జమ అవుతుండడంతో తొందరపడ్డాడు."

ఈ ఒక్క ఉద్యోగే కాదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ప్రధానంగా వైద్యశాఖ అధికారులు, సిబ్బంది ఈ మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థ వలలో చిక్కుకున్నారు. జీతాలే కాకుండా అప్పులు తెచ్చి ఎల్ఎఫ్ ఫైనాన్స్ వర్క్ కంపెనీలో పెట్టుబడులు పెట్టారు. కొద్దిరోజుల పాటు వీరందరినీ మురిపించిన సదరు సంస్థ.. ఆ తర్వాత బోర్డు తిప్పేసింది.

-సంగారెడ్డి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



ప్రఖ్యాత ఎలక్ట్రానిక్ కంపెనీకి చెందిన సంస్థగా "లైఫ్ ఫైనాన్స్ వర్క్" (ఎల్ఎఫ్)ను తెరమీదకు తెచ్చారు. ఇందులో మెదక్ పట్టణానికి చెందిన ఓ వైద్య ఉద్యోగి కీలకపాత్ర పోషించారు. తానే చక్రం తిప్పుతూ తన పరిధిలో మరికొందరిని నియమించుకున్నాడు. వీరంతా తమ సహచర ఉద్యోగులు, బంధువులను ఆకర్షించారు. రూ.35వేలు చెల్లిస్తే 20 రోజులపాటు ప్రతీరోజు రూ.5వేల చొప్పున ఖాతాలో జమ అవుతాయని ప్రచారం చేశారు. ఇలా జమయినట్లు కొన్ని ఖాతాలు, స్క్రీన్‌షాట్లు చూపించడంతో చాలామంది విశ్వసించారు. ఫలితంగా రూ.35వేలే కాకుండా రూ.లక్షల్లో సొమ్ము చెల్లించారు. ఇంకా కొందరు ఎలక్ట్రానిక్ కంపెనీలో తయారయ్యే వస్తువులపై పెట్టుబడుల రూపంలో చెల్లించి దారుణంగా మోసపోయారు.

సర్కారు ఉద్యోగులు..చదువుకున్నోళ్లు

రూ.20 కోట్ల దాకా సొమ్మును కొల్లగొట్టిన ఈ ఎల్ఎఫ్ మార్కెటింగ్ ~

మిగతా 6వ పేజీలో

రైల్వేలో ఉద్యోగం పేరిట టోకరా

నకిలీ ఐడీకార్డుతో డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న సైబర్ నేరగాడు



జహీరాబాద్‌లో స్టేషన్ మేనేజర్‌తో మాట్లాడుతున్న బాధితురాలు

జహీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో టికెట్ కలెక్టర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పిన సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి యువతి మోసపోయిన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో శుక్రవారం వెలుగుచూసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం నారాయణఖేడ్ నియోజకవర్గం అబ్బెంద గ్రామానికి చెందిన బిరాదర్ భాగ్యలక్ష్మి హైదరాబాద్‌లోని బోరబండలో భర్త కృష్ణతో కలిసి నివాసం ఉంటున్నది. ఇన్‌స్టాగ్రాంలో ఓ రీల్‌లో రైల్వేలో ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఉన్న పోస్టును చూసింది. అందులో పేర్కొన్న నంబర్ ఫోన్ చేయగా అపరిచితుడు మాట్లాడి రైల్వేలో టికెట్ కలెక్టర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. తొలుత ఐడీకార్డు కోసం రూ.850 పంపించాలని తన ఖాతా నంబర్ ఇచ్చాడు. నమ్మిన యువతి డబ్బు పంపడంతో రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా నకిలీ ఐడీకార్డును వాట్సాప్‌లో పంపించాడు. ఉద్యోగ నియామాకపత్రం కోసం రూ.18వేలు అవసరమని, తొలుత రూ.7,250 పంపించాలని చెప్పగా యువతి పంపించింది. మరోసారి ఫోన్ చేసి వెరిఫికేషన్ కోడ్ ఓపెన్ కావడం లేదని, మరో రూ. 5,250 పంపిస్తే ఓపెన్ అవుతుందని చెప్పడంతో పంపించింది. అయినా వెరిఫికేషన్ కోడ్ ఓపెన్ కావడం లేదని జీఎస్టీ కోసం మరో రూ.5వేలు చెల్లిస్తే నియమాకపత్రం పంపిస్తానని చెప్పాడు. తాను జహీరాబాద్ రైల్వేస్టేషన్‌లో ఉద్యోగం చేస్తానని, అక్కడికి డబ్బు తీసుకురావాలని చెప్పాడు. దీంతో, తాత వినాయకరావుతో కలిసి భాగ్యలక్ష్మి శుక్రవారం జహీరాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. సైబర్ నేరగాడు పంపించిన డూప్లికేట్ ఐడీ కార్డును అక్కడ స్టేషన్ మేనేజర్ మాధవకృష్ణకు చూపించింది. జరిగిన విషయం తెలుసుకుని ఇదంతా మోసమని మేనేజర్ చెప్పడంతో ఆమె మరోసారి సైబర్ నేరగాడికి ఫోన్ చేసింది. అక్కడే ఉండాలని తమకు సంబంధించిన వ్యక్తి వస్తాడని చెప్పడంతో స్టేషన్‌లోనే ఉండిపోయింది. ఎవరూ రాకపోగా, స్టేషన్ మేనేజర్ సమాచారంతో సైబర్‌క్రైం అధికారి రషీద్ అక్కడికి చేరుకుని విచారణ జరిపాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టగా దర్యాప్తులో భాగ్యలక్ష్మి ఫోన్ చేసిన సైబర్ నేరగాడు హరియాణాకు చెందినవాడని గుర్తించారు. దర్యాప్తు కొనసాగుతున్నదని సీఐ శివలింగం తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరు చెప్పినా నమ్మవద్దని, అపరిచితులకు డబ్బులు బదిలీ చేయవద్దని సూచించారు.



బల్దియాకు 'ఆర్థిక' ఇబ్బందులు

మెదక్‌కు నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు

ఆస్తిపన్ను వసూళ్లలో వెనుకబాటు ఫలితం

ఇతర మున్సిపాలిటీలకు మంజూరు

మెదక్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోలేకపోవడంతో మెదక్ మున్సిపాలిటీకి 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. కేంద్రం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం మున్సిపాలిటీ డిమాండ్‌లో 75 శాతం పన్ను వసూలు తప్పనిసరి. అయితే, మెదక్ బల్దియా ఈ రేటును చేరుకోలేకపోవడంతో జనాభా ప్రాతిపదికన రావాల్సిన రూ. 1.30 కోట్ల నిధులు నిలిచిపోయాయి. జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలకు మాత్రం నిధులు విడుదలయ్యాయి. నర్సాపూర్ మున్సిపాలిటీకి రూ.47,92,00, రామాయంపేట మున్సిపాలిటీకి రూ.43,83,000 విడుదలయ్యాయి. ఈ నిధులతో ఆయా ప్రాంతాల్లో తాగునీరు, మురికి కాలువల నిర్మాణం, వీధి లైట్ల నిర్వహణ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి అవకాశం లభించింది. మెదక్‌లో మాత్రం అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

పన్ను వసూళ్లలో తీవ్ర వైఫల్యం

2023-24 ఆర్థిక సంవత్సరంలో మెదక్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సంబంధించి పన్ను రూపేణా రూ.14.30 కోట్లు వసూలు కావాల్సి ఉండగా.. కేవలం రూ.4.47 కోట్లు మాత్రమే పన్ను రాబడి వచ్చింది. దీనివల్ల మున్సిపాలిటీ ఆర్థిక సంఘం నిధుల అర్హతను కోల్పోయింది. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం ఆస్తుల అంచనా లెక్కలనే ఇప్పటికీ ప్రామాణికంగా తీసుకుంటుండడం. ఏళ్ల తరబడి బల్దియాలో సిబ్బంది కొరత వేధించడం. వసూలు విభాగంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. కొత్త ఆస్తుల నమోదు, రికార్డుల నవీకరణలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. పలు వార్డుల్లో బిల్లుల పంపిణీ సరిగా జరగకపోవడంతో పన్ను చెల్లింపుల్లో నిర్లక్ష్యం నెలకొంటున్నది.

లక్ష్యం చేరుకునేందుకు ప్రత్యేక కసరత్తు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిధులను పొందడానికి మెదక్ బల్దియా అదనంగా వసూళ్లను పెంచే దిశగా చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఇటీవల ముప్పై మంది వార్డు అధికారులు నియామకమయ్యారు. వీరు కొత్త కట్టడాల అంచనాలను రూపొందించడం, ఉన్న భవనాల విస్తీర్ణాన్ని కొలతలు వేసి నిర్ధారించడం వంటి చర్యలు చేపట్టి పన్ను లెక్కింపు ప్రక్రియను వేగవంతం చేశారు. వార్డుల వారీగా పన్ను కలెక్షన్ టార్గెట్లు నిర్ణయించి

మిగతా 8వ పేజీలో

మద్యం దరఖాస్తులకు పోటాపోటీ

ఒక్కరోజే సంగారెడ్డిలో 1,080, సిద్దిపేటలో 689

ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రూ. 130 కోట్ల ఆదాయం

నేడు భారీ సంఖ్యలో పెరిగే అవకాశం

రూ.300 కోట్లు దాటుతుందని అంచనా

సంగారెడ్డి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మద్యం షాపులకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. రూ.3లక్షల ఫీజు నిర్ణయించడంతో తొలుత ఆశావహులు వెనక్కు తగ్గినట్లు కనిపించినా ఈ వ్యాపారంలో లాభాలు భారీగా ఉండడంతో దరఖాస్తులు క్రమంగా పెరుగుతున్నాయి. శుక్రవారం పోటీపడి దరఖాస్తులు సమర్పించారు. సంగారెడ్డిలో అత్యధికంగా 1,080, సిద్దిపేటలో 689, మెదక్‌లో 346 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రూ. 130 కోట్ల ఆదాయం వచ్చింది. నేడు చివరి రోజు కావడంతో పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఆబ్కారీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు వ్యక్తిగతంగా, ఐదారుగురు గ్రూపుగా మద్యం షాపులకు దరఖాస్తులు చేశారు. నేడు చివరి రోజు కావడంతో సిండికేట్ బృందాలన్నీ బరిలోకి దిగనున్నాయి. ఏయే షాపులకు తక్కువ దరఖాస్తులు వచ్చాయో వివరాలు తీసుకొని నేడు పోటీ పడనున్నారు. అత్యధికంగా అమ్మకాలు, లాభాలు ఉన్న మద్యం దుకాణాలనూ టార్గెట్ చేయనున్నారు. ఒక్కో సిండికేట్ తరఫున 100 షాపులకు పైగా దరఖాస్తులు సమర్పిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో, ఉమ్మడి జిల్లాలో రూ.300కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

ఇప్పటి వరకు దరఖాస్తులు

జిల్లా	వైన్‌షాపులు	దరఖాస్తులు	ఆదాయం(కోట్లలో)
సంగారెడ్డి	101	2280	68.40
సిద్దిపేట	93	1250	37.50
మెదక్	49	800	24.00

రెండేళ్ల క్రితం దరఖాస్తుల వివరాలు

జిల్లా	వైన్‌షాపులు	దరఖాస్తులు	ఆదాయం(కోట్లలో)
సంగారెడ్డి	101	6,156	123.12
సిద్దిపేట	93	4,166	83.32
మెదక్	49	1,905	38.10

కన్నేసి.. కాజేసి

- సంగారెడ్డిలో దొంగల హల్‌చల్
- రెక్కీ నిర్వహించి మరీ చోరీలు
- నిలిపి ఉంచిన కార్లు టార్గెట్
- డబ్బులు తీసుకుని జంప్
- ఆందోళనలో పట్టణవాసులు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలో ఇటీవల కాలంలో సినీ ఫక్కీలో చోరీలు జరుగుతున్నాయి. బ్యాంకులు, రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద కాపుకాస్తూ కన్నేస్తున్న ముఠా చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. సంగారెడ్డి పట్టణం హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. పటాన్‌చెరు, రామచంద్రపురం, జిన్నారం వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్కడి భూముల క్రయవిక్రయాల కోసం సంగారెడ్డి సమీపంలోని కంది మండల కేంద్రంలో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ప్రతీనిత్యం భూముల క్రయవిక్రయాల కోసం వస్తుంటారు.



కందిలో దొంగలు పగులగొట్టిన కారు అద్దం

భూముల క్రయవిక్రయాల కోసం లక్షల రూపాయల నగదును కార్లలో తీసుకువస్తుంటారు. అలాగే, పట్టణంలోని బ్యాంకుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు విత్‌డ్రా చేసి బైక్‌లు, కార్లలో తీసుకెళ్తుంటారు. ఇలా పట్టణంలో, రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పెద్దమొత్తంలో నగదు లావాదేవీలు కొనసాగుతుండటంతో దొంగలు రెచ్చిపోతున్నారు. బ్యాంకులు, రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద కాపుగాసి డబ్బులు విత్‌డ్రా చేసేవారు, రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద డబ్బులు తీసుకువచ్చే వారిని గుర్తించి టార్గెట్ చేసుకుంటున్నారు. అటువంటి వాహనాలను వెంబడించి ఎక్కడైనా వాహనాలు ఆపగానే చోరీ చేస్తున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడవుతోంది. ఇటీవల కాలంలో సంగారెడ్డి పట్టణంలో జరిగిన మూడు చోరీల్లో

మిగతా 8వ పేజీలో

కారు అద్దాలు పగులగొట్టి రూ.1.50 లక్షలు చోరీ

కంది, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కంది మండల కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో శుక్రవారం సాయంత్రం చోరీ జరిగింది. ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం పటాన్‌చెరు మండలం బీరంగూడకు చెందిన ఎల్లబోయిన శ్రావణ్‌కుమార్ తన టీఎస్ 02 ఈహెచ్ 1123 నంబరు కారులో రూ.1.50 లక్షల నగదు ఉంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లారు. సాయంత్రం 3.30 గంటల సమయంలో తిరిగి వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులగొట్టి అందులో నుంచి రూ.1.50 లక్షలు అపహరించారు. ఇంద్రకరణ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యంతో చదివితే సివిల్స్ సాధ్యమే : కలెక్టర్



కలెక్టర్ ప్రావీణ్య

పుల్‌కల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్‌లకు ఎంపికయ్యేలా చదువుకుంటూ మరో వైపు విశ్లేషణాత్మక విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సంగారెడ్డి కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ విశ్వనాథరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంజనీరింగ్ చదువుతూనే విద్యార్థులు సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధం కావొచ్చని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన, సరైన ప్రణాళిక, నిరంతర కృషితో ముందుకు సాగితే సివిల్ సర్వీస్ వంటి అత్యున్నత ఉద్యోగాలను సాధించడం సాధ్యమేనన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న తేడాలు విద్యార్థుల లక్ష్యసాధనకు అడ్డంకిగా భావించవద్దన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న నేటి కాలంలో ప్రతీ విద్యార్థికి సమాన అవకాశాలు ఉన్నాయన్నారు. సివిల్ సర్వీసులు, యూపీఎస్సీ, తదితర పోటీ పరీక్షల గురించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు కలెక్టర్ సమాధానాలిచ్చారు. అనంతరం సుల్తాన్‌పూర్, తాడ్దానిపల్లి గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో పాండు, తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎంపీడీవో శంకర్, పంచాయతీ కార్యదర్శి సిద్దమ్మ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

కొడుకుకి శిక్షపడుతుందేమోనని ఆవేదనతో..

● గుండె పోటుతో తండ్రి మృతి

సిద్దిపేట క్రైం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ కేసులో నిందితుడిగా ఉన్న కన్న కొడుకుకి శిక్ష పడుతుందేమోననే ఆవేదనతో గుండెపోటుతో ఓ తండ్రి మృతి చెందిన ఘటన సిద్ధిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. కొము రవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన మహమ్మద్ బడేసాబ్ (55) చిన్న కుమారుడైన షర్ఫద్దీన్‌పై ఓ బాలిక అత్యాచార ఘటనలో 29 సెప్టెంబర్ 2024లో పోక్సో కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయగా, కేసు విచారణ కొనసాగుతుంది. శుక్రవారం కేసులో తుది తీర్పు వెలువడుతుందని బడేసాబ్ తన ఇద్దరు కుమారులు మహబూబ్, షర్ఫద్దీన్‌తో కలిసి సిద్ధిపేట కోర్టుకు వచ్చారు. ఈ క్రమంలోనే బడేసాబ్ అస్వస్థతతకు గురి కావడంతో వెంటనే స్పందించిన కుమారులు అతడికి సీపీఆర్ చేసి వారి కారులోనే మొదటగా పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే బడేసాబ్ మృతిచెందినట్లు తెలిపారు

ఎల్లమ్మ దేవాలయంలోని విగ్రహాల చోరీకి యత్నం

చిన్నశంకరంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి విలువైన విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. గౌడ సంఘం నాయకులు వివరాల ప్రకారం.. ఎల్లమ్మ ఆలయ ప్రధానం ద్వారం తలుపులు ధ్వంస్వంసం చేసి విగ్రహాలను చోరీకి యత్నించే సమయంతో ఆలయం పక్కన ఇంటి నుంచి వ్యక్తులు బయటకు రావడంతో వారిని చూసి కేకలు వేశారు. వెంటనే దొంగలు పరుగులు తీశారు. ఈమేరకు గౌడ సంఘం నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నడుస్తున్న కారులోంచి మంటలు



దగ్ధమవుతున్న డస్టర్ కారు

రాజేంద్రనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): షైలార్‌దేవుపల్లి రోడ్డులో ఓ డస్టర్ కారులో శుక్రవారం మంటలు చెలరేగాయి. పటాన్ చెరువుకు చెందిన శ్రావణ్ ఏపీ31సీక్యూ2111 నెంబరు డస్టర్ కారులో శుక్రవారం షైలార్‌దేవుపల్లి వచ్చాడు. కారు వెళ్తున్న సమయంలో మంటలు వచ్చాయి. కారును రోడ్డుపైనే ఆపి అతడు కారు దిగిపోయాడు. కారు ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. షైలార్‌దేవుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

లింక్‌రోడ్ల అభివృద్ధితో తగ్గనున్న దూరాభారం



బూచనెల్లి-తూంకుంట గ్రామాల మధ్యలో పాడైన లింక్‌రోడ్డు

జహీరాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధానరోడ్లతోపాటు అంతర్గతరోడ్లు అధ్వానంగా మారాయి. ప్రధానరోడ్ల మరమ్మతులకే దిక్కులేదు. ఇంక లింకురోడ్ల అభివృద్ధిపై పాలకులు, అధికారులు దృష్టిపెడుతారా అనే ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతుంది. వీటిని అభివృద్ధిచేస్తే దూరాభారం, వ్యయ ప్రయాసాలు తగ్గతాయని జహీరాబాద్, మొగుడంపల్లి మండలాలపరిధిలోగల గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. లింక్‌రోడ్లను అభివృద్ధిచేయకపోవడంతో ప్రజలు సమీపగ్రామాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. లింక్‌రోడ్లను అభివృద్ధిచేయాలని అధికారులకు, నాయకులకు విన్నవించినా ప్రయోజనం కొరవడిందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి లింక్‌రోడ్లఅభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తూ దూరభారం తగ్గించేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధ్వానం ఆనెగుంట-మల్‌చెల్మరోడ్డు

మండల పరిధిలోని మల్‌చెల్మ-ఆనెగుంట గ్రామాల మధ్యలో గల లింక్ రోడ్డు పూర్తిగా పాడై కాలినడకకు పనికిరాకుండా తయారైంది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవట్లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనెగుంట-మల్‌చెల్మ గ్రామాల మధ్యదూరం 4కిలోమీటర్లు ఉండగా శేఖాపూర్ గ్రామంమీదుగ చుట్టు తిరిగి వెళ్లాలంటే 12కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని వారు వివరించారు. దశాబ్ధాల కాలంగా ఈ రోడ్డు మరమ్మతులకు నోచుకోక పోవడం తీరును చూస్తుంటే అభివృద్ధిపై పాలకుల పనితీరు ఎలా ఉందో ఇట్టే అవగతమవుతుందన్నారు.

మల్‌చెల్మ-ఆనెగుంట గ్రామాల మధ్యలో గల రోడ్డుకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్డును అభివృద్ధిచేయక పోతే ఆందోళనలను చేపడుతామని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.



మల్‌చెల్మ-ఆనెగుంట గ్రామాల మధ్యలో అద్వానంగామారిన రోడ్డు

ప్రాథమిక స్థాయిలోనే అభ్యసన సామర్థ్యాలు రావాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ కల్చరల్/కొల్చారం/హవేళిఘణపూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని డైట్ కళాశాల్లో ఫౌండేషనల్ లిటరసీ న్యూమర్సీ అమలుకు ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ హజరై పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో పేద విద్యార్థులు చదువుతారు కాబట్టి వారికి అన్ని సామర్థ్యాలు నేర్పించాలన్నారు. విద్యార్థులకు చదువు చక్కగా రావాలంటే సంబంధిత సూపర్‌వైజింగ్ అధికారులు ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాలు పాఠశాలలను తనిఖీ చేసి నప్పుడే విద్యార్థులకు న్యాయం జరుగుతుంన్నారు.

చిన్నారుల అనారోగ్యానికి గురికాకుండా సంరక్షించాలి

చిన్నారులు అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే బాధ్యత జిల్లా వెల్ఫేర్ అధికారులు సిబ్బందిపై ఉందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమీక్ష సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డ ఆరోగ్యంపై తల్లి, బిడ్డలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్లలో సహజసిద్ధంగా లభించే మునగ, కరివేపాకు వంటి ఆకు కూరలను ఆహారంలో భాగం చేసుకోవాలని, ఇవి శరీరానికి పుష్టి శక్తిని అంది స్తాయని అన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కోల్చారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భూ భారతి పెండింగ్ దరఖాస్తులను, భూ రికార్డులను, హాజరు పుస్తకాల్ని పరిశీలించారు. వివిధ భూ సమస్యలతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన భూ బాధితులతో మాట్లాడారు. వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు.

రసమయి ఫాంహౌస్‌పై దాడికి యత్నం

●అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత

బెజ్జంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు చెందిన ఫాంహౌస్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం దాడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నంలో ఉద్రిక్తత నెలకొంది. పలువురు కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లు ఒకరిపై మరొకరు విమర్శలు, దూషణలు చేసుకున్న ఓ ఆడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రసమయి వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మండలంలోని గుండారం గ్రామంలోని రసమయి బాలకిషన్‌కు చెందిన ఫాంహౌస్‌ను ముట్టడించేందుకు నియోజకవర్గంలోని బెజ్జంకి, ఇల్లంతకుంట, తిమ్మాపూర్, గన్నేరువరం మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు వివిధమార్గాల్లో వచ్చారు. పోలీసులు వచ్చి వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, కొందరు ఫాంహౌస్‌పైకి రాళ్లు విసిరారు. పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్సై సౌజన్య ఆధ్వర్యంలో పోలీసు బలగాలను భారీగా మోహరించారు. కాంగ్రెస్ నాయకులు రసమయికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే సత్యనారాయణకు.. రసమయి బాలకిషన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నాయకులు, కార్యకర్తల వద్దకు ఎమ్మెల్యే సత్యనారాయణ వెళ్లి వారితో మాట్లాడి మాజీ ఎమ్మెల్యే రసమయిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకు ముందు స్థానిక ఎడ్లబండి చౌరస్తాలో రసమయి బాలకిషన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.

సింగూరు డ్యాంలో మత్స్యకార్మికుడు గల్లంతు

పుల్‌కల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకార్మికుడు గల్లంతైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పుల్కల్ ఎస్సై ఎస్.విశ్వజన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సదాశివపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన దాసరి కుమార్ (36) కుటుంబంతో కలిసి కొంతకాలంగా సింగూరు గ్రామంలో నివాసముంటున్నారు. సింగూరు ప్రాజెక్టులో చేపలు పడుతూ జీవనం వెళ్లదీస్తున్న కుమార్ గురువారం సాయంత్రం 4 గంటలకు ప్రాజెక్టులో వలలు వేసేందుకు వెళ్లాడు. అయితే, అ వలలను తీసేందుకని శుక్రవారం ఉదయం 8 గంటలకు తెప్ప సహాయంతో ప్రాజెక్టు నీటిలోకి దిగాడు. నీటిలో కొట్టుకుపోయాడు. ఎప్పటిలాగే చేపల వేటకు వెళ్లిన కుమార్ ఇంటికి వస్తాడని కుటుంబ సభ్యులు ఎదురు చూశారు. ఉదయం 10 గంటలైనా ఇంటికి రాలేదు. నీటిలో గల్లంతైన కుమార్ ఆచూకీ కోసం పోలీసులు స్థానిక మత్స్యకార్మికుల సహాయంతో గాలింపు చర్యలు చేపడుతున్నారు. భార్య దాసరి భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విశ్వజన్ తెలిపారు.

వాగులో మృతదేహం లభ్యం

తూప్రాన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం నాగులపల్లి శివారులో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని గుర్తించినట్లు తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపారు. తూప్రాన్ నుంచి వెల్దుర్తి వెళ్లే మార్గంలో నాగులపల్లి శివారులో దొంతి వాగు పై ఏర్పాటు చేసిన బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని బయటకు తీశారు. ఆ వ్యక్తి మూడు నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లుగా అనుమానిస్తున్నారు. మృతుడిని గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై శివానంద వివరించారు.

దొమ్మట వైన్స్‌లో వ్యక్తి మృతి



పర్మిట్ రూంలో మృతిచెందిన అరవింద్ రెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

దౌల్తాబాద్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): దొమ్మాట వైన్స్ పర్మిట్ రూమ్‌లోని మద్యం తాగుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. దొమ్మాట గ్రామానికి చెందిన అరవింద్ రెడ్డి (45) వేన్స్ షాపులో మద్యం తాగుతూ మృతి చెందాడు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో అరవింద్ రెడ్డి తో ఎవరెవరు మద్యం తాగారనేది ఏ విధంగా మృతి చెందాడు అనేది తెలియడంలేదు. దీంతో అరవింద్ రెడ్డి మృతి అనుమానాస్పదంగా మారింది. విషయం తెలుసుకున్న తొగుట సీఐ లతీఫ్, ఎస్సై అరుణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడిని శవ పరీక్షలకోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంతకు ముందు మృతుడి కుటుంబ సభ్యులు,బంధువులు శవాన్ని పోస్టుమార్టం చేయనీయమని కొద్దిసేపు సీఐ, ఎస్సై తో వాదించారు. సీఐ లతీఫ్ మృతుని కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తానని నచ్చజెప్పడంతో పోస్టుమార్టానికి అంగీకరించారు.

డ్రగ్స్ తయారు చేస్తే చర్యలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ వంటివి తయారు చేస్తే చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.రాము ఒక ప్రకటనలో హెచ్చరించారు. మత్తుమందుల దందాను అరికట్టేందుకు ప్రజలే ముందుకు రావాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. డ్రగ్స్‌పై 18005996969 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అత్యాచారం కేసులో నిందితుడికి..

●20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

దుబ్బాక, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ సిద్దిపేట అదనపు ఫస్ట్‌క్లాస్ డిస్ట్రిక్ కోర్టు ప్రధాన న్యాయాధికారి జయప్రసాద్ శుక్రవారం తీర్పు వెలువరించారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. చిన్నకోడూరు మండలం మల్యాల గ్రామానికి చెందిన విఠల్ (52) 2018 జూన్ 17న దుబ్బాక మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి, ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పటి సీఐ పరశురాములు కేసు నమోదు చేయగా, తర్వాత వచ్చిన సీఐ మన్నె కృష్ణ కేసు విచారణ చేపట్టి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడే విధంగా కేసు పూర్తిస్థాయి విచారణ జరిపిన పోలీసులను సిద్దిపేట సీపీ విజయ్‌కుమార్ అభినందించారు.

చైన్ స్నాచింగ్

సిద్దిపేటక్రైం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి మెడలో ఉన్న మూడు తులాల బంగారు చైనును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్‌కు చెందిన దంగేటి భవిత శుక్రవారం ఉదయం కోమటి చెరువుకు వాకింగ్ వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో వైట్ కలర్ టూ వీలర్ పై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు చైనును ఎతుకెళ్లారు. బాధితురాలు సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయమే లక్ష్యం

● సంగారెడ్డి న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంగారెడ్డి న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం అందించడమే తమ లక్ష్యమని సంగారెడ్డి న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ విరమణ పొందిన ఉద్యోగుల సంఘం కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తమ హక్కులను తెలుసుకొని, అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మార్గదర్శకాల ప్రకారం అందిస్తున్న ఉచిత న్యాయ సహాయ సేవలు, మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్‌ల ద్వారా వివాద పరిష్కారం, పెన్షన్, సేవా ప్రయోజనాలు, మహిళా వృద్ధుల హక్కులు, ఆస్తి వివాదాలు, వినియోగదారుల రక్షణ చట్టాల వంటి అంశాలపై వివరించారు. వృద్ధులు తమ పిల్లలు లేదా వారసుల ద్వారా నిర్లక్ష్యం, వేధింపులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు మెయిటెనెన్స్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్, సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం న్యాయ పరిరక్షణ పొందవచ్చని సూచించారు. వృద్ధుల హక్కులు, వారసత్వ సమస్యలు, ఆస్తి మోసాలు, ఆరోగ్య, పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ అందుబాటులో వుంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు.

'మల్టీ' మాయ రూ.20కోట్లు

(5వ పేజీ తరువాయి)

సంస్థలో పెట్టుబడులు పెట్టిన వారంతా ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు కావడం గమనార్హం. అదే విధంగా ఉన్నత చదువులు చదివి సమాజంలో మంచి స్థితిలో ఉన్నవారే. అందుకే సదరు సంస్థ నిర్వాహకులు సైతం ఇలాంటి వారిని ముగ్గులోకి దింపారు. అన్నీ తెలిసి మోసపోవడంతో వారు కూడా జీర్ణించుకోలేక పోతున్నారు. ఎవరికైనా చెప్పుకుందామంటే తమ పరువే పోతున్నదని ఓ బాధితుడు 'ఆంధ్రజ్యోతి'తో ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీకి సంబంధించిన జీఎస్టీ నంబరు ఆధారంగా డబ్బులు జమ చేయాల్సి రావడంతో ఆలోచించకుండానే అడుగు వేశామని వాపోయాడు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై చర్చ..

'మల్టీ పల్టీ' శీర్షికన ఈనెల 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై విస్తృతంగా చర్చ జరిగింది. ఎల్‌ఎఫ్ మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థ మోసాలను బట్టబయలు చేయడంతో .. ఇంకా పెట్టుబడులు పెట్టాలనే ఆలోచన ఉన్నవారు ఆగిపోయారు. ఇప్పటికే డబ్బు పెట్టిన వారు సదరు ఏజెంట్లను నిలదీస్తున్నారు. పలువురు బాధితులు ఎల్‌ఎఫ్ వర్క్ సంస్థ మోసాలపై సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమను మోసగించారని పేర్కొంటూ పోలీసులను ఆశ్రయించారు.

నకిలీ విత్తనాలతో పంట నష్టం

● కంపెనీపై చర్యలు తీసుకోవాలని ఫరీద్‌పూర్ రైతుల వేడుకోలు


ఫరీద్‌పూర్‌లో నష్టపోయిన పంటను చూపుతున్న రైతులు

హవేళిఘణపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తమ కంపెనీ విత్తనాలు వాడితే అధిక దిగుబడి వస్తుందని నమ్మబలికి మోసం చేసిందని మండలంలోని ఫరీద్‌పూర్ గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు పది ఎకరాల్లో పొలంలో లక్ష్మీమెహర్ అనే విత్తనాలను వాడి వరిపంటను సాగు చేశారు. ప్రస్తుతం పొట్టదశలో ఉన్న పొలం మొత్తం కంకి రాకుండా పొల్లు కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తాము ఆరుగాలం కష్టపడి పండించిన పంట నష్టానికి కారణమైన సదరు కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయాధికారి దేవకుమార్ పంటను పరిశీలించారు. మరోమారు శాస్త్రవేత్తలతో పరిశీలించి, వారి నుంచి నివేదిక వచ్చిన తరువాత చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.


బందారం రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలు

కలగానే కల్లాలు.. ధాన్యం ఆరబోతకు కష్టాలు

స్థలం లేక రైతుల పాట్లు... తప్పక రోడ్లపైనే వడ్ల రాశులు

కొండపాక, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పంటలు కోతకు వచ్చి, ధాన్యం చేతికందగా, ఆరబోయడానికి కల్లాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి కూడా స్థలం దొరకక ఆయా గ్రామాల్లో సమస్యలు తలెత్తుతున్నాయి.

శాశ్వత మార్కెట్ యార్డులు కావాలి

అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరైన కల్లాల వసతి లేక రైతులు పంటను రోడ్లపై ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ప్రభుత్వ భూమి ఉన్న కొన్ని గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ, ఆ భూమి చదునుగా లేకపోవడంతో ధాన్యాన్ని ఆరబోయడానికి రైతులు కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ భూమి ఉన్న గ్రామాల్లో మార్కెట్ యార్డులను శాశ్వతంగా ఏర్పాటు చేయాలని, వాటిలో సీసీ కల్లాలు (కాంక్రీట్ ప్లాట్‌ఫామ్‌లు) నిర్మించాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు. మార్కెట్ కమిటీ నిధులను కేటాయించి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కల్లాలు ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యం తోపాటు వర్షాలు పడినా నష్టం జరగదని, అలాగే రోడ్లపై ఆరపోయడం తప్పుతుందని


కొండపాక రోడ్డుపై ఆరపోసిన ధాన్యం

రైతులు అభిప్రాయ పడుతున్నారు.

బందారంలో ప్రభుత్వ భూమి కబ్జా

కొండపాక మండలం బందారం గ్రామంలో రికార్డుల ప్రకారం 19 ఎకరాల 32 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. అయితే, అందులో సగానికి పైగా భూమి కబ్జాకు గురైందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మిగిలిన భూమిలోనే రైతులు ధాన్యం కుప్పలు వేసి ఆరబెడుతున్నారు. ప్రస్తుత కొనుగోలు కేంద్రాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. బందారం గ్రామంలోని ప్రభుత్వ భూమిని సర్వే చేపించి, అందులో మార్కెట్ యార్డును, సీసీ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు రైతులు అధికారులను అభ్యర్థించారు. మిగతా భూమిలో డంపింగ్ షెడ్డు వంటి ఇతర ప్రభుత్వ భవనాలను నిర్మించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు కోరుతున్నారు.

రైతుల సౌకర్యార్థం మార్కెట్‌యార్డు నిర్మించాలి



బందారంలో సుమారు 19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. సర్వే చేయించి అందులో మార్కెట్ యార్డు సీసీ ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేస్తే రైతులకు సౌలభ్యంగా ఉంటుంది. మిగతా భూమిలో గ్రామానికి ప్రభుత్వ అవసరాలకు అవసరమయ్యే వాటిని నిర్మించాలి. మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే రైతుల సమస్యలు తీరుతాయి.

- శ్రీనివాస్‌రెడ్డి, బందారం

పత్తికి ప్రత్యామ్నాయంగా జొన్న సాగు

ఝరాసంగం మండలంలో రైతుల ఆసక్తి

ఝరాసంగం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఝరాసంగం మండలంలో రైతులు యాసంగిలో జొన్న పంట సాగుపై దృష్టి సారించారు. ఖరీఫ్‌లో అధిక వర్షాల కారణంగా పత్తి పంట నష్టపోవడంతో, అనేక మంది రైతులు ప్రత్యామ్నాయంగా జొన్నను సాగు చేస్తున్నారు.

అనుకూల వాతావరణం

యాసంగి పంటలకు ప్రస్తుతం ఉన్న వాతావరణం చాలా అనుకూలంగా ఉంది. జొన్న పంట ప్రధానంగా భూమిలోని తేమ, మంచు ఆధారంగానే పెరుగుతుంది. మెట్ట ప్రాంత రైతులు దీనిని సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ సంవత్సరం జొన్న సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

కొద్దిగా పక్షుల బాధ ఉంటుంది



ఈ జొన్నలు కేవలం తేమ, మంచుకు మాత్రమే పెరుగుతాయి. పంట చేతికి వచ్చే సమయంలో కొద్దిగా పక్షుల బాధ ఉంటుంది. కొన్ని రోజులు పంటకు కాపాలగా ఉంటే చాలు, జొన్నలను ఇంటికి చేర్చుకోవచ్చు. జొన్న రొట్టె తినడం వల్ల ఎలాంటి వ్యాధులు ఉండవు. అందుకే నేను ఇంత ఆరోగ్యంగా ఉన్నాను.

- పాషమియా, రైతు, చీలపల్లి


చీలపల్లి శివారులో సాగు చేస్తున్న రైతులు

దిగుబడి ఇలా..

- ఎకరానికి విత్తనం 4-5 కిలోలు, డీఏపీ ఒక బస్తా, కలుపు మందులకు కలిపి మొత్తం రూ. 5 వేల నుంచి 6 వేల వరకు ఖర్చు అవుతుంది.
- ప్రస్తుత వాతావరణం కొనసాగితే, ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.
- మార్కెట్‌లో జొన్నలు క్వింటాలుకు సుమారు రూ.4 వేల వరకు ధర పలుకుతున్నాయి.
- ఎకరానికి సుమారు రూ.32 వేల వరకు ఆదాయం వస్తుంది. ఖర్చులు పోను, రైతులకు రూ.26 వేల వరకు మిగిలే అవకాశం ఉంది.

జొన్నలకు పెరుగుతున్న డిమాండ్

మార్కెట్‌లో జొన్నలకు డిమాండ్ పెరుగుతోంది. జొన్న రొట్టె తినడం వల్ల మంచి పోషకాలు లభించడంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని వైద్యులు సూచించడంతో, ప్రజలు వీటి వైపు మొగ్గు చూపుతున్నారు.

పార్టీని బలోపేతం చేసే సత్తా ఉన్న నాయకుడికే పదవి

● మెదక్, సిద్దిపేట జిల్లాల ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రౌటేల

వర్గల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకునే, పార్టీని బలోపేతం చేసే సత్తా ఉన్న నాయకుడు డీసీసీ అధ్యక్షుడిగా కావాలని ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రౌటేల అన్నారు. శుక్రవారం వర్గల్ మండలం శాఖారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వర్గల్, ములుగు, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట, మెదక్ జిల్లాల డీసీసీ అధ్యక్ష పదవుల కోసం ఆశావహుల నుంచి ఆమె దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. కింది స్థాయి కార్యకర్త నుంచి ప్రజల మధ్య ఉంటూ సేవలందించిన నాయకుడినే కార్యకర్తల అభిప్రాయం మేరకు డీసీసీ అధ్యక్షులుగా నియమిస్తామన్నారు. రానున్న రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే పార్టీ లక్ష్యంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న చోట్ల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. పార్టీలో కష్టపడిన కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని హామీఇచ్చారు. అగ్ర నేతలు సోనియాగాంధీ, మల్లికార్జునఖర్గే ఆదేశాల మేరకు జిల్లా కమిటీల నియామకం చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుండగా, కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చే విధంగా ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. వర్గల్, ములుగు, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల నుంచి సుమారు 20 వరకు దరఖాస్తులు వచ్చినట్లు, వాటిని పరిశీలించి, కార్యకర్తల వద్ద వ్యక్తిగతంగా తీసుకున్న అభిప్రాయం మేరకు అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రావు, పీసీసీ కోఆర్డినేటర్ నజీర్ హైమద్, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వర్గల్ మండలం శాఖారంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రౌటేల, జహీరాబాద్ మాట్లాడుతున్న పరిశీలకురాలు జరీటా లైత్‌ఫ్లాంగ్

పార్టీ పటిష్టతకు సంఘటితంగా పనిచేయాలి

● ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
● ఏఐసీసీ పరిశీలకురాలు జరీటా లైత్‌ఫ్లాంగ్

జహీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పార్టీ పటిష్టత కోసం అందరూ సంఘటితంగా పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి జరీటా లైత్‌ఫ్లాంగ్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడి ఎంపికలో భాగంగా శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ సంఘటన్ శ్రీజన్ అభియాన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని జిల్లా అధ్యక్షుడి ఎంపిక విషయంలో మండలాల వారీగా నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను వేర్వేరుగా సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అందరం కష్టపడి పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, మాజీమంత్రి డా.చంద్రశేఖర్, మాజీ టీఎస్‌ఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ వైద్య పరికరాల ఉత్పత్తితో సామాన్యులకు అందుబాటులో వైద్యం

● 80 శాతం పరికరాలు దిగుమతిపై ఆధారం
● దూరదృష్టితోనే ఆనాడు మెడికల్ డివైజ్ పార్క్ ఏర్పాటు
● మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
● హ్యూవెల్ లైఫ్‌సైన్స్ పరిశ్రమలో కెమికల్ ల్యాబ్ ప్రారంభం

అమీన్‌పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెరిగిపోతున్న వైద్య ఖర్చులను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చేందుకు స్వదేశీ ఉత్పత్తులు పెంచడం తప్ప మరో ప్రత్యామ్నాయ మార్గం లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్క్‌లో హ్యూవెన్ లైఫ్ సైన్స్ పరిశ్రమ పదో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పరిశ్రమలో కెమికల్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంక్లిష్టమైన వైద్య పరికరాలను 78 నుంచి 80 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడంతోనే వైద్య ఖర్చులు ఎక్కువగా ఉన్నాయన్నారు. సామాన్యుడికి అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన గత ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్వదేశీ వైద్య పరికరాల


మాట్లాడుతున్న కేటీఆర్

ఉత్పత్తులను పెంచే విధంగా సుల్తాన్‌పూర్‌లో ప్రత్యేక మెడికల్ డివైజ్ పార్క్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అద్భుతమైన పరిశ్రమలను ఇక్కడ నెలకొల్పి వేలాది మందికి ఉపాధి కల్పించడంతో పాటు తక్కువకు ధరలకు లభ్యమయ్యే మెడికల్ పరికరాలను విజయవంతంగా తయారు చేస్తున్నారన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో స్వదేశీ మెడికల్ ఉత్పత్తుల ఆవశ్యకత గుర్తించామన్నారు. దిగుమతులపై ఆధారపడకుండా స్వదేశీ(ఇండిజినస్) మెడికల్ పరికరాలను తయారు చేసుకోవడంపై దృష్టి సారించామన్నారు. కోవిడ్ సమయంలో ఆర్‌టీపీసీఆర్ కిట్‌లకు పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి వచ్చిందన్నారు. ఆరు వేలు ఖర్చు అయ్యే కిట్టును నేడు సుల్తాన్‌పూర్‌లో రూ.12 తయారు చేయడం విప్లవాత్మకమైన మార్పును సూచిస్తుందన్నారు. ఫలితంగా ఆధునిక వైద్యం సామాన్యుడికి మరింత చేరువ అవుతుందన్నారు. వ్యాక్సిన్‌ల ఉత్పత్తికి కేంద్రంగా ఉన్న హైదరాబాద్ త్వరలోనే మెడికల్ డివైజ్‌ల ఉత్పత్తిలో సైతం రికార్డులు సృష్టిస్తుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాంతాబయాటెక్ చైర్మన్ వరప్రసాద్ రెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు డాక్టర్ త్రిపాఠి, డాక్టర్ రచనాతిపాఠి, డాక్టర్.శశిధర్, డాక్టర్ లక్ష్మి, నియోజవకర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పరామర్శించిన కేటీఆర్


ఓదార్చుతున్న కేటీఆర్

చిన్నకోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య(85) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, మాజీ మంత్రి, ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం వారిని పరామర్శించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్‌లోని ఎర్రోళ్ల ఇంటికి వెళ్లి విజ్జయ్య ఫ్లెక్సీకి పూలు చల్లి నివాళులర్పించారు. ఎర్రోళ్ల శ్రీనివాస్, కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్‌లు సదానందం, కనకరాజు, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ మేళాకు పోటెత్తారు


ఐటీఐలో అప్రెంటీస్ మేళాకు హాజరైన విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కంది మండలం ఎద్దుమైలారంలోని ఆయుధ కర్మాగారం(ఓడీఎఫ్)లో అప్రెంటీస్ కోసం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం అప్రెంటీస్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. రిజిస్ట్రేషన్ కోసం విద్యార్థులు భారీగా క్యూలైన్లలో నిల్చున్నారు. సుమారు 1200 మంది అభ్యర్థులు అప్రెంటీస్ మేళాకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓడీఎఫ్ డీజీఎం హెచ్‌ఆర్ కేసీ మోహన్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, అప్రెంటీస్‌షిప్ అడ్వైజర్ ఆర్.మహేశ్, హత్నూర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించే శక్తి, చిత్తశుద్ధి బీజేపీకే ఉంది

● స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులనే గెలిపించాలి
● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

గుమ్మడిదల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించగల శక్తి, చిత్తశుద్ధి కేవలం బీజేపీకే ఉందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్పష్టం చేశారు. గుమ్మడిదల మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన బీజేపీ కార్యాలయాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెలి రవీందర్, మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్‌తో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. మండల అధ్యక్షుడు ఐలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తల కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రం అమలు చేస్తున్న పథకాలు ప్రతీ కుటుంబానికి చేరేలా కృషి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెలి రవీందర్ మాట్లాడుతూ బీజేపీ కేవలం రాజకీయ పార్టీ కాదని, దేశ సేవకుల ఉద్యమమని అభివర్ణించారు. ప్రతీ గ్రామంలో పార్టీ జెండా ఎగరేసే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పలుకు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు పోర్యగారి రవీందర్‌రెడ్డి, బుచ్చగాడు రామ్‌రెడ్డి, స్థానిక నాయకులు, మహిళా మోర్చా, యువ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

సారూ.. తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాం

● అదనపు కలెక్టర్ ఎదుట విద్యార్థుల ఆవేదన
● సమస్యను పరిష్కరించాలని డీఈకి ఫోన్‌లో ఆదేశం

మునిపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : 'సారూ.. తాగునీరు లేక చాలా ఇబ్బంది పడుతున్నాం' అని విద్యార్థులు సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. శుక్రవారం ఆయన మునిపల్లిలోని మోడల్ స్కూల్, ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పంచాయతీ రాజ్ శాఖ డీఈకి అదనపు కలెక్టర్ ఫోన్ చేసి మోడల్ స్కూల్‌లో నెల కొన్న నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హాస్టల్, పాఠశాల, కళాశాలల్లోని గదులు, భోజనం, ఎస్సీ బాలుర హాస్టల్‌లో ప్రహరీ నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. హాస్టల్ ప్రహరీ నిర్మాణ పనులను నాణ్యతతో చేసేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మార్వో గంగాభవాని, ఎంపీడీవో హరినందన్‌రావు, ఎంఈవో భీంసింగ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లిక తదితరులు ఉన్నారు.

ఈ ఫిజిక్స్ టీచర్ మాకొద్దు

● కన్నారం పాఠశాల విద్యార్థుల ధర్నా


ధర్నా చేస్తున్న విద్యార్థులు

కౌడిపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : 'పాఠాలు సరిగ్గా చెప్పని ఫిజిక్స్ టీచర్ మాకొద్దూ' అంటూ మెదక్ జిల్లాలోని కౌడిపల్లి మండలం కన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ధర్నాకు దిగారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలిసి మాజీ సర్పంచ్ దివ్యమహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సదరు ఉపాధ్యాయుడిని తక్షణమే విధుల నుంచి తప్పించాలని ప్రధానోపాధ్యాయుడికి వినతిపత్రం అందజేశారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీకాంత్ గౌడ్ పాఠాలు చెప్పకుండా తరచుగా ఫోన్లలో మాట్లాడటం, సెల్‌ఫోన్‌లో కామెడీ షోలు చూస్తూ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. తరగతిలో తప్పులు చెప్పడమే కాకుండా, విద్యార్థులను ఒకరిపైఒకరు దాడి చేసుకోవాలని పురిగొల్పడం, బాలికల చేతితో బాలురను చెప్పుతో కొట్టించడం చేస్తున్నారని తెలిపారు. రెండు రోజుల క్రితం ఈ ఉపాధ్యాయుడు చేయించిన దాడిలో 8వ తరగతి విద్యార్థి సంతోష్ స్పృహ తప్పి పడిపోయాడని తల్లిదండ్రులు పేర్కొన్నారు. అలాగే, శ్రీకాంత్ గౌడ్ ఫేస్ రికగ్నిషన్ సిస్టం అటెండెన్స్ మొబైల్‌లో చేయనని ప్రధానోపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ప్రధానోపాధ్యాయుడు శేషాద్రి కుమార్ స్పందిస్తూ, విషయం వాస్తవమేనని, ఈ అంశాన్ని డీఈవో దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. పోలీసులు కూడా పాఠశాలకు చేరుకుని వివరాలు సేకరించారు.

సిద్దిపేట అభివృద్ధికి ఆటో కార్మికులే బ్రాండ్ అంబాసిడర్లు


ఆటో కార్మికుడి కుటుంబసభ్యులకు ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న హరీశ్‌రావు

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్లు ఆటో కార్మికులని, మీకు, మీ కుటుంబసభ్యులకు అండగా ఉంటానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. నంగునూరు మండలం దర్గపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అసర్ల నర్సింలు ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి మృతి చెందగా ఆటో క్రెడిట్ కో ఆపరేట్ సొసైటీ ద్వారా రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును మృతుడి కుటుంబసభ్యులకు శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక అప్పులు తెచ్చుకొని తిరిగి కట్టలేని పరిస్థితి ఆటో కార్మికులదని, ఆ వేదన చూసి తట్టుకోలేక ఆటో క్రెడిట్ కో ఆపరేట్ సొసైటీ ఏర్పాటు చేసి తద్వారా ఆర్థిక ప్రయోజనాలను అందిస్తున్నట్లు వివరించారు. సొసైటీ ఏర్పాటైనప్పటి నుంచి 15 మంది కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున రూ.30 లక్షలు చెక్కులను అందజేశానని తెలిపారు. కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయిన ఆటో కార్మికులు కుటుంబాలకు, రెక్కాడితో కానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్నకార్మికులందరికీ తాను అండగా ఉంటానని పెద్దన్నగా హరీశ్‌రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు పాల సాయిరాం, ఆటో కార్మికులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు భవజ్ఞ


భవజ్ఞ

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా గజ్వేల్‌ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన 69 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ అండర్-14 బాలికల టోర్నమెంట్ విభాగంలో విద్యార్థిని భవజ్ఞ ప్రతిభ కనబర్చింది. సంగారెడ్డిలోని శ్రీఅక్షయ విద్యాలయంలో 6 వ తరగతి చదువుతున్న భవజ్ఞ వాలీబాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఆడడానికి ఎంపికైంది. సంటి భవజ్ఞను ఎస్జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాసరావు, శ్రీఅక్షయ విద్యాలయం ప్రిన్సిపాల్ సుధాకర్ జోషి, తల్లిదండ్రులు అభినందించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

నారాయణఖేడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లను భర్తీ చేయడానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ జయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో బాలికలకు సంబంధించి ఇస్నాపూర్, చిట్కూల్, రంజోల్, రాయికోడ్, ఆందోల్ పాఠశాలలు, బాలురకు సంబంధించి హత్నూర, నల్లవాగు, నారాయణఖేడ్, సింగూరు, కొండాపూర్, న్యాల్‌కల్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 22 వరకు ఇస్నాపూర్ పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

21న రగ్బీ ఎంపికలు

నారాయణఖేడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 21 న ఉదయం 10 గంటలకు ఖేడ్‌లోని ఈ-తక్షిల పాఠశాల మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి అండర్-19 రగ్బీ క్రీడాకారుల ఎంపిక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గణపతి శుక్రవారం తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 19 ఏళ్లలోపు బాలబాలికలు అర్హులన్నారు. శిబిరానికి వచ్చే బాలబాలికలు బోనఫైడ్ సర్టిఫికెట్, గత సంవత్సరం చదివిన ప్రోగ్రెస్ కార్డు, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం పీడీలు మారుతి (9177241933), రమేశ్ (9959552635), పీఈటీ శ్రీనాథ్ (9666044630) నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చేగుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలంలోని మూడు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ సంపత్ కుమార్ తెలిపారు. చేగుంట 132కేవీ సబ్‌స్టేషన్ నుంచి వెలువడే 33కేవీ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కసానపల్లి, చందాయిపేట్, ముక్కరాజిపేట్ గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, రైతులు, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పరిశుభ్రతపై అవగాహన

వెల్దుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే స్వచ్ఛత పక్షోత్సవాల (స్వచ్ఛత పక్వాడ్) లక్ష్యమని వెల్దుర్తి ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సాంబయ్య పేర్కొన్నారు. స్వచ్ఛత పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. చెత్త రహిత దేశం నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గడ్డపోతారంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు

జిన్నారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం మున్సిపాలిటీ కేంద్రంలో సర్దార్ పటేల్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీమ్) సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం గడ్డపోతారంలో సికింద్రాబాద్ ఎస్‌పీ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల బృందం వారం రోజుల పాటు నిర్వహించనున్న సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్థానిక పార్కులో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలను విద్యార్థులు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ క్యాంపును మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య సందర్శించి, విద్యార్థి దశ నుంచి సామాజిక సేవలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో బాబు, రాజేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.


కోహీర్ గ్రామ శివారులో పాడైపోయి కంకర తేలిన రోడ్డు


బిలాల్‌పూర్ గ్రామ సమీపంలో రోడ్డుపై గుంత

కంకర తేలి.. గుంతలు పడి..

కోహీర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని కవేలి చౌరస్తా నుంచి మండల కేంద్రమైన కోహీర్, బిలాల్‌పూర్, మనియార్‌పల్లి గ్రామాల మీదుగా వికారాబాద్ జిల్లా తాండూరు వరకు ఉన్న ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై అనేక చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోయి గాయాల పాలవుతున్నారు. కంకర తేలి ఉన్న రోడ్డుతో వాహనదారులకు, ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. కవేలి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపు వద్ద రోడ్డుపై, నారింజ వంతెనకు ఇరువైపులా, కోహీర్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద, బిలాల్‌పూర్ గ్రామ సమీపంలో కూడా రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డును బాగు చేయాలని..

పుల్‌కల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం రోడ్డును బాగు చేయాలంటూ గిరిజనులు నిరసనకు దిగారు. వర్షాలకు ఐదు కిలో మీటర్ల మేర రోడ్డు ధ్వంసమైందని తెలిపారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ ఆధ్వర్యంలో గిరిజనులు రహదారిపై నిలిచిన బురద నీటిలోకిదిగి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రవీందర్‌నాయక్, మోహన్, సంగ్యా, మొత్య, సంతోష్, సురేష్, శివ, శంకర్, మహదేవ్, నరేందర్, శివప్ప, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


నీటిలో దిగి నిరసన తెలుపుతున్న స్థానికులు


మల్లేశయ్యను సన్మానిస్తున్న కార్మికులు

బదిలీ అయిన డీఎంకు సన్మానం

నారాయణఖేడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్‌లో మూడు సంవత్సరాలుగా డీఎంగా బాధ్యతలు నిర్వహించి వరంగల్‌కు బదిలీ అయిన మల్లేశయ్యకు శుక్రవారం డిపో కార్మికులు వీడ్కోలు సభ నిర్వహించారు. అలాగే నూతన డీఎంగా వచ్చిన సుబ్రహ్మణ్యంపై పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్లేశయ్య మాట్లాడుతూ నారాయణఖేడ్ ప్రజల ఆదరాభిమానాలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఏఎంఎఫ్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందులాల్, సెక్యూరిటీ ఇన్‌చార్జి సత్యనారాయణ, వట్‌పల్లి ఆశ్రమ పీఠాధిపతి ముకుంద్‌రావు అప్ప, పాండు, కార్మికులు, నాయకులు, జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన


ఆలయ కమిటీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్/వెల్దుర్తి అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ సమీపంలోని అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి శుక్రవారం పరిశీలించారు. వచ్చే నవంబరులోగా పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే వెల్దుర్తిలో ఇటీవల మృతి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ రమేశచందర్ తల్లి మణెమ్మ, విలేఖరి పరమేశ్వర్ తల్లి నర్సమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ జడ్పీ కో-ఆప్షన్ మన్సూర్, పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ తదితరులు ఉన్నారు

న్యాయవాదిని బెదిరించినందుకు విధుల బహిష్కరించి నిరసన

నారాయణఖేడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉన్న న్యాయవాదిని ప్రతివాది తరపు వ్యక్తి చంపుతామని కోర్టు ఆవరణలోనే బెదిరించినందుకు నిరసనగా నారాయణఖేడ్‌లో శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజిరెడ్డి మాట్లాడుతూ నారాయణఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ రావును ప్రత్యర్థికి సంబంధించిన వ్యక్తి బెదిరించారన్నారు. ఆ వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, న్యాయవాదులు మారుతిరెడ్డి, లక్ష్మణ్‌రావు, సాయిలు, సుధాకర్, జీవన, రాజు, సుధాకర్, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలలో మాక్ పోలింగ్


మాక్ పోలింగ్‌లో విద్యార్థులు

నాగల్‌గిద్ద, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మోర్గి మోడల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాలల్లో 9 వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 410 మంది విద్యార్థులు మాక్ పోలింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకోవడంతో పాటు ఓటు విలువ, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల హామీలు ఎలా ఉంటాయో అవగాహన పెంపొందించుకున్నారు. అలాగే ఎన్నికల అధికార విధులు తదితర అంశాలను విద్యార్థులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రిటర్నింగ్ అధికారిగా ప్రిన్సిపల్ సువర్ణ వ్యవహరించారు. మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నాగల్‌గిద్ద ఎంఈవో మన్మథకిశోర్, నాగల్‌గిద్ద జడ్పీ హైస్కూల్ హెడ్‌మాస్టర్ సిద్దారెడ్డి సందర్శించి విధానాన్ని పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై విచారణ

నాగల్‌గిద్ద, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సమయపాలన పాటించని ఉపాధ్యాయుల తీరుపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్థానిక నాగల్‌గిద్ద మండల ఎంఈవో మన్మథకిశోర్ స్పందించారు. శుక్రవారం మండల పరిధిలోని బిక్కు, శ్యావన్ తండాల ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను విచారించి, ఉపాధ్యాయుల సమయపాలన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కోళ్ల ఫామ్ నుంచి దుర్వాసన.. గ్రామస్థుల నిరసన

నర్సాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్‌లోని కోళ్ల ఫారం వల్ల సమీపంలోని పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ గ్రామస్థులు శుక్రవారం ఫారం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, పాఠశాల సమీపంలోనే కోళ్ల ఫారం ఉండటం వల్ల తీవ్ర దుర్వాసన వస్తోందని తెలిపారు. దాంతో పాటు ఈగలు, ఇతర కీటకాల వల్ల కూడా తీవ్ర అసౌకర్యంగా మారిందని, దీంతో పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని, దాంతో ధర్నా చేయక తప్పలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గ్రామస్థాయి పరిపాలనపై శిక్షణ

● చేగుంట మండలంలో పర్యటించిన 53 మంది ట్రైనీ ఎంపీడీవోలు


పథకాలు, పనులపై ఆరా తీస్తున్న ట్రైనీ ఎంపీడీవోలు

చేగుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయి పరిపాలన విధానంపై 53 మంది ట్రైనీ ఎంపీడీవోలకు సీనియర్ ఫ్యాకల్టీ అధికారులు అనిల్ కుమార్, చిన్నారెడ్డిలు అవగాహన కల్పించారు. శుక్రవారం చేగుంట మండలంలోని చిన్న శివనూర్, కరీంనగర్ గ్రామాల్లో ట్రైనీ ఎంపీడీవోలు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన పలు అభివృద్ధి పనులైన వైకుంఠధామం, డంపింగ్ యార్డు, ఉపాధి హామీ పనులు, పల్లె ప్రకృతి వనాలు, వీధి దీపాలు, గ్రామంలోని పరిశుభ్రత, మహిళా సంఘాల పనితీరు తదితరాలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఎంపీడీవోలకు జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ రావులు గ్రామాల అభివృద్ధి, మండల పరిషత్ విధి విధానాలపై పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో యాదయ్య, ఎంపీడీవోలు ప్రశాంత్, సాజి లుద్దీన్, ఏపీవో శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతికి అనుకూలమైన జీవనశైలిని అలవర్చుకోవాలి

● మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ప్రకృతికి అనుకూలమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెదక్ ఎకో క్లబ్, తెలంగాణ గ్రీన్ క్రాప్స్ విశ్వా ఫౌండేషన్, స్వచ్ఛ ప్లానెట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఎకో బజార్ కార్యశాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.హెస్సెన్, ఎకో క్లబ్, స్మార్ట్ క్లబ్ కన్వీనర్లు మురళీ, డా. శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : దీపావళికి ఏర్పాటు చేసే టపాసుల దుకాణాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. లేనియెడల వారిపై ఎక్స్‌ప్లోజివ్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. టపాకాయల దుకాణాలు జనావాసాలకు దూరంగా, ఖాళీ ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఖాళీ ప్రదేశానికి సంబంధించిన స్థల యజమాని నుంచి ఎన్‌వోసీ సర్టిఫికేట్ పొంది ఉండాలని, షాపుకు, షాపుకు మధ్య వ్యత్యాసం 3 మీటర్లు మరియు రెసిడెన్షియల్/గృహనిర్మాణలకు 50 మీటర్ల దూరంలో ఉండాన్నారు. టపాకాయల దుకాణాలలో ఫైర్ ఆక్సిడెంట్ కు సంబంధించి తక్షణం స్పందించే విధంగా ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరం: డీఈవో

మనోహరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు దాతల సహాయం ఎంతో మేలు చేస్తుందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. శుక్రవారం మనోహరాబాద్ మండలం కూచారం పరిధిలోని దిల్లాయి ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ప్రమిద ట్రస్ట్ ఎస్జీటీయూ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరీ సామాగ్రి, బ్యాగులను విద్యాధికారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే కూచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైక్లిస్ట్ గ్రూప్ ద్వారా బూట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తూప్రాన్ మండల విద్యాధికారి పర్వతి సత్యనారాయణ, సూరారం ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, ఎస్జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, జిల్లా అధ్యక్షుడు జింక అశోక్, ఉపేందర్, ఉపాధ్యాయులు ప్రకాశ్, ఉదయ్‌రంజన్ గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నేసి.. కాజేసి

(5వ పేజీ తరువాయి)

దొంగలు బైక్‌పై వచ్చి చోరీలు చేసినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది.

దుండగులను త్వరలో పట్టుకుంటాం

సంగారెడ్డి పట్టణంలో ఇటీవల జరిగిన దొంగతనాలపై విచారణ చేస్తున్నాం. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. పట్టణంలో గస్తీ ముమ్మరం చేశాం. ఎక్కువ మొత్తంలో డబ్బు తీసుకువెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. నగదును వాహనాల్లో ఉంచకుండా తమ వెంటే ఉంచుకోవాలి.

-కె.సత్తయ్యగౌడ్, సంగారెడ్డి డీఎస్పీ

రూ.2 కోట్లతో మీట్ మార్కెట్

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అధునాతన మార్కెట్ యార్డులు నిర్మించడానికి నిధులు మంజూరవుతున్నాయని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి పాతరామచంద్రాపురంలో మీట్ మార్కెట్ నిర్మించడానికి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మార్కెట్ యార్డు నిర్మించడానికి రూ2 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

పెద్దశంకరంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం శివయ్యపల్లి గ్రామంలో రైతులకు పత్తి కొనుగోలు యాప్‌పై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి క్రిష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు అఖిల్, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

జహీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కంది పంట సాగులో రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు వరప్రసాద్, ప్రసాద్, రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మొగుడంపల్లి మండలంలోని గొడిగార్‌పల్లి గ్రామంలో కంది పంటల సాగు, సేంద్రీయ ఎరువుల తయారీ, వినియోగం, పంటల సస్యరక్షణ చర్యలు తదితరాలపై అవగాహన కల్పించారు.

బల్దియాకు 'ఆర్థిక' ఇబ్బందులు

(5వ పేజీ తరువాయి)

ఇంటింటికీ ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నారు. పన్ను బకాయిదారుల జాబితా తయారుచేసి ఫోన్ నెంబర్ల ద్వారా రిమైండర్లు పంపే ప్రయత్నం జరుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ. 6.22 కోట్లు వసూలయ్యాయి. ఈసారి లక్ష్యాన్ని చేరుకుంటామని తదుపరి విడతలో నిధులు సాధిస్తామని అధికారులు ధీమాతో ఉన్నారు.

ఈ సారి మెదక్ మున్సిపాలిటీకి అర్హత వస్తుంది

గత సంవత్సరం ఆస్తి పన్ను వసూలు మందగించడంతో గత ఆర్థిక సంఘం నిధుల మంజూరుకు అర్హత సాధించలేకపోయాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పరిస్థితి మెరుగుపడింది. ఇప్పటికే రూ.6.22 కోట్ల పన్ను రాబడి వచ్చింది. ఈ సంవత్సరాంతానికి 80 శాతం మించి పన్నులు వసూలు చేసి అగ్రస్థానంలో నిలుస్తాం. గతంలో మున్సిపల్ సిబ్బందికి వేతనాలు చెల్లించలేని దుస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ సమస్యను అధిగమించాం. కొత్తగా వార్డు అధికారులను నియమించడంతో పన్ను వసూళ్లలో వేగం పెరిగింది. ఈ సంవత్సరం మెదక్ మున్సిపాలిటీకి కచ్చితంగా ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

-శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్, మెదక్ మున్సిపాలిటీ

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

● బీసీ నేతల పిలుపు ● వివిధ పార్టీలు, సంఘాల మద్దతు

న్యూస్ నెట్‌వర్క్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు శనివారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. దీనికి మెదక్ జిల్లాలో రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై బీజేపీ, బీఆర్ఎస్ విమర్శలు గుప్పించగా, కాంగ్రెస్ నాయకులు మాత్రం బీసీల పోరాటానికి సంఘీభావం తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల తరహాలోనే 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. నేడు తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ బంద్‌కు మద్దతు ప్రకటించారు. డీసీసీ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్ మాట్లాడుతూ బంద్‌లో కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొంటాయని తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ బీసీలకు న్యాయం చేయడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని బీసీ సంఘాల నేతలు సురేందర్‌గౌడ్, నర్సింహులు, అంజనేయులు పిలుపునిచ్చారు. బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ దిగంబర్ మాట్లాడుతూ బీసీల సత్తా చాటాలని కోరారు. నేషనల్ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి విగ్రాం రాజన్ గౌడ్ బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లంబాడి హక్కుల పోరాట సమితి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, భీమ్ ఆర్మీ, సీపీఐ వంటి ఇతర సంఘాలు కూడా బంద్‌కు మద్దతు ప్రకటించాయి.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జాతీయ క్రీడాకారులుగా రాణించాలి

● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మైత్రి మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండవ రోజు వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చదువుతున్న సమయంలో నిత్యం ప్రాక్టీస్ చేస్తూ క్రీడలకు సమయం కేటాయించుకోవాలని కోరారు. అనంతరం రామచంద్రాపురం భెల్ అయ్యప్పస్వామి ఆలయం నుంచి శబరిమల వరకు చేపట్టిన పాదయాత్రను ప్రారంభించారు. పరమేశ్‌యాదవ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డేలో అతిథులు, కళాశాల చైర్మన్ ధారాసింగ్ భార్గవి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఒకేషనల్ అండ్ పారా మెడికల్ కళాశాల ఫ్రెషర్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జీఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికిప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్లు వసంత, లలితలు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు చేసిన డ్యాన్సులు, స్కిట్లు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బి. ధారాసింగ్ భార్గవి, జీజీహెచ్ పాథాలజిస్ట్ గోవింద్, మాస్టర్ మైండ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బాంధవి, అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ సుమ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజయం ఒక్క రోజులో వచ్చే అద్భుతం కాదు

● మోటివేషనల్ స్పీకర్ క్రియేటర్ కృష్ణ


మాట్లాడుతున్న క్రియేటర్ కృష్ణ

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విజయం ఒక్క రోజులో వచ్చే అద్భుతం కాదని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, మార్గదర్శకుడు క్రియేటర్ కృష్ణ తెలిపారు. సంగారెడ్డిలోని ఎస్వీ జూనియర్ కాలేజీలో వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ చేసే చిన్న చిన్న ప్రయత్నాల ఫలితమే విజయానికి నాంది అన్నారు. వైఫల్యాలకు భయపడకుండా ముందుకు సాగాలని, ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి దానిని అభివృద్ధి చేసుకోవాలని మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పటాన్‌చెరు బీఆర్ఎస్ శ్రేణులు


జూబ్లీహిల్స్‌లో కరపత్రాలు పంచుతున్న పటాన్‌చెరు బీఆర్ఎస్ శ్రేణులు

పటాన్‌చెరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ యువజన బృందం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తరపున శుక్రవారం ప్రచారం నిర్వహించింది. మధ్యాహ్నం సమయంలో మసీదుల్లో ప్రార్థనలు ముగించుకొని బయటకు వస్తున్న ముస్లిం ఓటర్లకు కరపత్రాలు పంచారు. పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి సమన్వయం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంకేవై యువజన సభ్యులు సందీప్‌గిరి, అజ్మత, అజ్జూ, కళ్యాణ్‌యాదవ్, అఫ్జల్ తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయిలో గురుకుల విద్యార్థుల ప్రతిభ


బహుమతి గెలుచుకున్న విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

నర్సాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం మెదక్‌లో నిర్వహించిన అండర్-14 ఖోఖో పోటీలలో నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపారు ఈ పోటీల్లో రెండో స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ కృష్ణకిశోర్ తెలిపారు. బహుమతి గెలుచుకున్న విద్యార్థులను గురుకుల అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బసవరాజ్, పీఈటీ లింగం, రాజు తదితరులు పాల్గొన్నారు.